క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలి



గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య కార్యదర్శి శేషాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా సీఎం ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ వడ్ల మూడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత



మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని సీరోలు గ్రామానికి చెందిన దివ్యాంగ బాలిక కన్నెబోయిన శ్రావ్యకు హోప్ స్టెప్ ఫౌండేషన్ సహకారంతో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ శుక్రవారం వీల్ చైర్ అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, సంస్థ సభ్యులు దుగ్గి రమేష్, ధనుష్, దీక్షిత్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన నలుగురు వరద బాధితులకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రు నాయక్ సహకారంతో రూ.16,500ల ఆర్థికసాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హరీశ్, శ్రీనివాస్, కుమారస్వామి, ప్రసాద్, వెంకన్న, అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా నవిత ఎంపిక



గార్ల: మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన బోడ నవిత శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ప్రస్తుతం నవిత సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నవితను మర్రిగూడెం, గార్ల ప్రముఖులు అభినందించారు.

'ప్రజా సమస్యలను గాలికొదిలేశారు'


డోర్నకల్: రాష్ట్ర పాలకులు ప్రజా సమస్యలు గాలికొదిలేయడంతో పండుగ వేళల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసమస్యలను, హామీలను గాలికొదిలి హైడ్రా పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. పండుగ వేళల్లో నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

వానరానికి అంత్యక్రియలు



కురవి: విద్యుదాఘాతంతో మృతి చెందిన వానరానికి హమాలీలు అంత్యక్రియలు జరిపి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం కురవి మండల కేంద్రంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవిలోని పశువుల సంత వద్ద విద్యుదాఘాతంతో కోతి(వానరం) మృతి చెందింది. అక్కడ పనిచేసే హమాలీ కార్మికులు కరణం ముత్తయ్యతోపాటు మరో ఇద్దరు ఒక ట్రేలో కోతి మృతదేహాన్ని తీసుకుని పశువుల సంతకు వెళ్లారు. గుంత తీసి ఉప్పు పోసి వానరాన్ని ఖననం చేసి అంత్యక్రియలు జరిపారు. అంత్యక్రియలు జరిపిన హమాలీ కార్మికులను గ్రామస్తులు అభినందించారు. హమాలీ కార్మికులు బాదావత్ రత్తు, నిమ్మశెట్టి రాంచంద్రు, తదితరులు పాల్గొన్నారు.

'దాండియా' సందడి



డోర్నకల్: స్థానిక అశోక్‌భవన్‌లో శుక్రవారం దాండియా వేడుకలు ఘనంగా జరిగాయి. జైన మతంలోపాటు మహేశ్వరీ సేవా సమాజ్‌కు చెందిన మార్వాడీ మహిళలు, పురుషులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు విజయదశమి

- ఆలయాల్లో పూజలు, వేడుకలు



కొలువైన అమ్మవారు

మహబూబాబాద్ రూరల్: విజయదశమి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దసరా ఉత్సవాలు, షమీ పూజ, అపరాజితపూజ, దేవీ ఉద్వాసన కార్యక్రమాలు శనివారం జరుగుతాయని నిర్వాహకులు చౌడవరపు మోహన్ రావు, ఇమ్మడి రవికుమార్ శుక్రవారం తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని దుర్గాదేవి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మండల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో..

మానుకోట మండల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు పమ్మిసనాతనాచారి తెలిపారు.

భక్తమార్కండేయ శివాలయంలో...

విజయదశమి దసరా మహోత్సవ వేడుకలను స్థానిక శ్రీభక్తమార్కండేయ శివాలయంలో సాయంత్రం 5గంటలకు నిర్వహిస్తున్నామని శ్రీభక్తమార్కండేయ పద్మశాలీ సంఘం నాయకులు తెలిపారు. ఇందులోభాగంగా శ్రీ రాజరాజేశ్వరిదేవీ, దుర్గామాత సహస్రనామ కుంకుమార్చన, అపరాజితపూజ జరుగుతాయని పేర్కొన్నారు.

మహేశ్వరి భవన్‌లో..

పట్టణంలోని మహేశ్వరి భవన్ మార్వాడి సత్రంలో దుర్గాదేవి ప్రత్యేక పూజలు, జమ్మిచెట్టు దర్శనం ఏర్పాటు చేశామని మార్వాడి యువమంచ్ బాధ్యులు ఎస్ఎస్‌లోయ తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయం వద్ద..

షమీ పూజ, జమ్మి ఆకు పంపిణీ పూజ కార్యక్రమాలు పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణాచార్యులు తెలిపారు. బ్రహ్మశ్రీ తాటిపాముల నర్సింహామూర్తి షమీ పూజలు నిర్వహిస్తారన్నారు.

హన్మంతునిగడ్డ అంజన్న ఆలయంలో..

పట్టణంలోని హన్మంతునిగడ్డలోగల ఆంజనేయస్వామి దేవాలయంలో షమీ పూజలు, అంజన్న స్వామికి ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు దాసరోజు సందీప్‌శాస్త్రీ తెలిపారు. ఈసందర్భంగా ఆలయానికి నూతనంగా రంగులు వేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు.

నేడు గాయత్రి దేవాలయంలో షమీ పూజ

విజయదశమి పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని నర్సంపేట రోడ్డులో గల మహాగాయత్రి దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు వంకోజు జలేంద్రాచార్యులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు షమీ పూజ ఉంటుందని భక్తులు ఈ పూజల్లో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆయన పేర్కొన్నారు.

రావణాసుర వధకు ఏర్పాట్లు పూర్తి



తయారైన రావణాసురుడి ప్రతిమలు

గూడూరు: మండల కేంద్రంలోని రాంలీలా మైదానంలో ప్రతీ సంవత్సరం మాదిరిగానే దసరా వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీసారి గ్రామపంచాయతీ పాలకవర్గం, హిందూ ఉత్సవ సమితి సంయుక్తంగా చేపట్టేది. కానీ ఈ సంవత్సరం పాలకవర్గం లేకపోవడంతో గ్రామస్తులంతా ఏకమై మొదటి నుంచి నిర్వహిస్తున్న హిందూ ఉత్సవ సమితి నిర్వహించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీంతో సమితి ప్రతినిధులు పది తలల రావణాసురుడి ప్రతిమను తయారీ గ్రామానికి చెందిన పగిడిపాల దేవేందర్ అనే వ్యక్తికి బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం రాత్రి వరకు 50 అడుగుల ఎత్తులో తయారైన దశకంఠుడి ప్రతిమకు అవసరమైన రంగులు పూర్తి చేశారు. ప్రధాన రహదారిపై అలంకరించిన విద్యుద్దీపాలు పట్టణ కేంద్రానికి పండుగ శోభను తెచ్చిపెట్టాయి.

నూతన కమిటీ ఎన్నిక

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ నూతన కమిటీని శుక్రవారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా మానేపల్లి ఉమేష్, ఉపాధ్యక్షుడిగా ఉర్లుకొండ మహేష్, ప్రధాన కార్యదర్శిగా దిండిగళ్ల సాయిబాబా, కోశాధికారిగా దండే ఉమేష్, ట్రేజరర్‌గా గుర్రం రాకేష్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా కోనేటి రామరాజు, దండే కృష్ణ, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లుగా కొంపెల్లి లింగమూర్తి, కుందనపల్లి మహేందర్, ముఖ్య సలహాదారులగా దండే బద్రి, గుండా దశరథ, అలువాల రమేశ్, శేరి ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో యూత్ సభ్యులు పెదగండి సాయిబాబా, దండే బుచ్చిరాములు, కొంపెల్లి నాగరాజు, ఆవుల గోవర్ధన్, బుస్స రాము, గడ్డం ప్రశాంత్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వీరన్నను సన్మానిస్తున్న సంఘం నాయకులు

కేసముద్రం: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని టీపీసీసీ ఓబీసీ స్టేట్ వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్నయాదవ్ అన్నారు. మండలంలోని కేసముద్రంవిలేజ్‌లో ఇటీవల ఓబీసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకమైన మేకల వీరన్నయాదవ్‌ను, యాదవసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యాదవసంఘం నాయకులు ముత్తయ్య, కుమార్, పెద్దబోయిన రాజశేఖర్, ఎలగలబోయిన రాజశేఖర్, కృష్ణ, దురేష్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డీఈ విజయ్

కురవి: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ డీఈ విజయ్ అన్నారు. మండలంలోని బలపాలశివారు లింగ్యాతండాలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన విద్యుత్ సేవలపై అవగాహన కల్పిస్తూ.. ప్రభుత్వం వినియోగదారులకు 938 రూపాయలకే మీటర్ ఇస్తామన్నారు. విద్యుత్ చౌర్యం నేరం అని ప్రతి ఇంటికి మీటర్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ రమేష్, ఏఈ శారద, విద్యుత్ సిబ్బంది జంపిరావు, రాంలాల్, లింగ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

బయ్యారం: బాలాజీపేట పంచాయతీ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు పంచాయతీ వాసులు విన్నవించారు. అనేక సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని తులారాం ప్రాజెక్టు కాల్వను ఆధునీకరించాలని కోరగా ఎమ్మెల్యే ఇరిగేషన్ డీఈతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయతీలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాంమూర్తిగౌడ్, వీరభద్రం, మల్లయ్య, మురళి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విచారణ పూర్తి చేయాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సైదులు

మరిపెడ రూరల్: సకాలంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలని తహసీల్దార్ దొడ్డారపు సైదులు వివిధ శాఖల ఉద్యోగులను ఆదేశించారు. శుక్రరవారం మరిపెడ మండలం అబ్బాయిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 335లోని చేపట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను తహసీల్దార్, ఎంపీఓ సోమ్లానాయక్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్థలాలపై వీలైనంతా తొందరగా విచారణ పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి, గిర్దావర్, ఇరిగేషన్ ఏఈతోపాటు అజ్మీరతండా, అమృనాయక్ తండా కార్యదర్శులు అశోక్, అజయ్, ఆపరేటర్ ఉమేష్‌లను కేటాయించినట్లు తెలిపారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడబ్ల్యు యాదగిరి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో కడప వాసి మృతి

కేసముద్రం: అనుమానాస్పదస్థితిలో కడప జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పెనుగొండ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం కడప జిల్లాలోని అంగడివీధికి చెందిన లక్క ప్రశాంత్ (31), అమీనా దంపతులు ఇద్దరు కూతుర్లతో కలిసి 3నెలల క్రితం బతుకుదెరువు కోసం పెనుగొండ గ్రామానికి వలస వచ్చి, ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. వారితోపాటు అమీనా తల్లి, సోదరుడు కూడా పని నిమిత్తం ఇక్కడికి వచ్చి, వారు ఉండే ఇంటి సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ప్రశాంత్ ఇక్కడే భవననిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రశాంత్, అమీనా దంపతులు రాత్రి గొడవ పడినట్లు తెలిసింది. శుక్రవారం తెల్లవారుజామున ప్రశాంత్ ఉరివేసుకున్నాడంటూ కుటుంబ సభ్యులు అతడిని ఆటోలో మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రశాంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కాగా ప్రశాంత్ మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతుండటంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

డోర్నకల్: స్థానిక గాంధీసెంటర్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించడాన్ని హర్షిస్తూ పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ కేశబోయిన కోటిలింగం, నాయకులు మాదా శ్రీనివాస్, ఎల్లావుల హరికృష్ణ, రెడ్డెబోయిన శంకర్, యాకేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మహబూబాబాద్: పూజలు చేస్తున్న భక్తులు



మహబూబాబాద్ రూరల్: అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



డోర్నకల్: ముత్యాలమ్మ ఆలయంలో కనకదుర్గ యాగం



గూడూరులో..



మహబూబాబాద్ రూరల్: పండ్లతో దుర్గామాతకు అలంకరణ



నెహ్రూసెంటర్‌లో అన్నదానం..

మహబూబాబాద్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ప్రతిష్ఠించిన దుర్గాదేవి మండపం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కిరణ్, దిలీప్‌కుమార్, సాత్విక్ పాల్గొన్నారు.

అన్నప్రసాదం పంపిణీ

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని 28వ వార్డులో శ్రీదుర్గామాత సన్నిధిలో భక్తులకు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించి అన్నప్రసాదం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ భూక్య ఉమ, బొల్లు రాజు, జీలుగుల భాస్కర్ పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో కొలువుదీరిన దుర్గామాతను పండ్లతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

గూడూరు: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతోపాటు అయోధ్యపురంలో కొలువుదీరిన అమ్మవారు శుక్రవారం మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

డోర్నకల్: స్థానిక గాంధీసెంటర్ ముత్యాలమ్మతల్లి ఆలయంలోని దుర్గామాతా మండపం వద్ద శుక్రవారం కనకదుర్గ హోమం నిర్వహించారు.

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని శిఖర్‌ఖానగడ్డలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భూక్య ఉమా, బి.అజయ్‌సారథిరెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మరిపెడ రూరల్: మండలంలోని వీరారం గ్రామంలోని దుర్గాదేవి అమ్మవారి శుక్రవారం మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షిప్త సమాచారం

పీడీఎస్ బియ్యం స్వాధీనం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంలో రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేయగా ఒకరు పరారీలో ఉన్నారని రూరల్ ఎస్సై వి.దీపిక శుక్రవారం తెలిపారు. రెండు ద్విచక్రవాహనాలపై రవి, కిషన్ రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఈదులపూసపల్లి గ్రామంలో కొనుగోలు చేసుకుని వేమునూరు గ్రామానికి తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. రెండు ద్విచక్రవాహనాలతోపాటుగా కిషన్, రవిని అదుపులోకి తీసుకున్నామని, మరో వ్యక్తి సతీష్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుతో గేదె మృతి

డోర్నకల్: మండలంలోని పెరుమాళ్లసంకీస గ్రామంలో శుక్రవారం పిడుగు పడి గేదె మృతి చెందింది. గ్రామంలోని కొత్తూరు కాలనీకి చెందిన పటాన్ నజియాకు చెందిన గేదెను ఇంటి సమీపంలోని చెట్టు కింది కట్టేసింది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతోపాటు చెట్టు సమీపంలో పిడుగుపడటంతో గేదె మృతి చెందింది. సమీపంలో జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పరామర్శ..

నెహ్రూసెంటర్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నూకల నరేష్‌రెడ్డి కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొంద్ర ఎల్లయ్య, బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాలకే వన్నెతెచ్చిన నిరంతర ప్రజా సేవకుడు నరేష్‌రెడ్డి అని కొనియాడారు. ఆయన మృతి తీరని లోటని ఆశయ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీను, సుధా, రాధా, శ్రీనివాస్, బాలరాజు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అభినందన సభ



చిన్నగూడూరు: జిల్లా ఉత్తమ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత ధర్మసోతు హీర్యా భువనగిరి జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూనూరులో విధులు నిర్వహించి ఇటీవల రిటైర్డ్ అయ్యాడు. శుక్రవారం మండలంలోని ఉగ్గంపల్లి గ్రామం వాల్యానాయక్ తండాలో ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభ నిర్వహించాడు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పాల్గొని హీర్యా దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించాడు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, నాయకులు పాల్గొన్నారు.

దేవతలను పూజించడం మన సంప్రదాయం



నెల్లికుదురు: గ్రామ దేవతలను పూజించడం మన సంప్రదాయమని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ఎంపీ కావ్య తల్లి కడియం వినయరాణి స్వగ్రామం అయిన మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామంలో వారి బంధువులు జిలుకర యాకాంతం, శ్రీనాథ్, సాంబమూర్తి శుక్రవారం నిర్వహించిన గ్రామ దేవతల పండుగకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఎర్రబెల్లిగూడెం గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి..

మరిపెడ రూరల్: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎల్లంపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గండి వీరభద్రం అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని మండలంలోని ఎల్లంపేటలో క్రికెట్ క్రీడా పోటీలను శుక్రవారం నిర్వహించారు మొదటి బహుమతిగా రూ.5 వేలు, షీల్డ్, ద్వితీయ, తృతీయ బహుతులగా షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్, బుచ్చిబాబు, శివయ్య, నరేష్, ఉర్లుకొండ మనోజ్, సందీప్, అశోక్, నరేష్ పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లి గ్రామంలో యువత శ్రమదానం నిర్వహించారు. గ్రామం నుంచి ఇనుగుర్తి మండల కేంద్రానికి వెళ్లే రహదారిపై అడ్డంగా ఉన్న చెట్లను శుక్రవారం తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. కార్యక్రమంలో యువకులు వంశీ యాదవ్, సందీప్ పటేల్, అరుణ్, హరీశ్, అనిల్, పవన్, వినయ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



దంతాలపల్లి: మండల కేంద్రంలో 2000–2001 విద్యాభారతి పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

నెహ్రూసెంటర్: సామాన్య ప్రజలకు భారంగా మారిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి శుక్రవారం డిమాండ్ చేశాడు. పేద, మధ్య తరగతి ప్రజలకు పెరిగిన ధరలు భారంగా మారాయన్నారు. పేద ప్రజలకు ధరలు అందుబాటులో ఉండేలా కృషి చేయాలని తెలిపారు.

'రైతుభరోసా' తక్షణమే అందించాలి

మరిపెడ: ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా నేటి వరకు రైతుభరోసా అందించలేదని, తక్షణమే అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరిపెడలో ఆయన మాట్లాడుతూ.. నేటి వరకు ప్రభుత్వం రైతు భరోసా అందించకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఉప్పలయ్య, నాగయ్య, ఎల్లయ్య, అనంతచారి తదితరులున్నారు.